ప్రలోభాలకు లొంగొద్దు

- బాన్సువాడ ఆర్డీవో రమేశ్ రాథోడ్
- పలు ప్రాంతాల్లో 5కే రన్



బాన్సువాడలో మాట్లాడుతున్న ఆర్డీవో రమేష్ రాథోడ్

బాన్సువాడ: ప్రతి ఒక్కరు తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్ సూచించారు. బుధవారం ఐ ఓట్ ఫర్ ష్యూర్ కార్యక్రమంలో భాగంగా బాన్సువాడలో 5కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆర్డీవో కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిణతిని చాటాలన్నారు. ఓటు వజ్రాయుధమని, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలని సూచించారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, పోలింగ్ శాతాన్ని పెంచడానికి కృషి చేయాలని సూచించారు. తహసీల్దార్ వరప్రసాద్, ఏటీవో జగన్, ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్, తదితరులున్నారు.

సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలి

ఎల్లారెడ్డి: ఓటు హక్కు ఉన్న పౌరులు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుని సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలని ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఐ ఓట్ ఫర్ ష్యూర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎల్లారెడ్డిలో 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. పోలింగ్ శాతం పెంచాలన్నారు. తహసీల్దార్ మహేందర్ కుమార్, సీఐ రవీందర్, పలు కళాశాలల విద్యార్థులు తదితరులున్నారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్): లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ముజీబ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎన్నికల అధికారులు ఆదేశాల మేరకు ఓటర్లను చైతన్యం చేస్తూ 5కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అధికారి విజయ్, ఎంపీవో వెంకట నర్సయ్య, ఆర్ఐ శంకర్ ఉన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల సామగ్రి భద్రపరిచే గదులను, పరిసరాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పరిశీలించి ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ముజీబ్, సర్వేయర్ గోపాల్, తదితరులున్నారు.



మద్నూర్‌లో ..



ఎల్లారెడ్డిలో..


మద్నూర్‌లో అధికారులకు సూచలిస్తున్న ఆర్‌వో

క్లుప్తంగా

హుండీ లెక్కింపు



రామారెడ్డి(ఎల్లారెడ్డి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. దేవాదాయ సహాయ కమిషనర్ సుప్రియ, ఆలయ కార్య నిర్వహణాధికారి ప్రభుగుప్తా ఆధ్వర్యంలో హుండీని లెక్క గట్టారు. రూ.5,29,181 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అర్చకులు శ్రీనివాసశర్మ, వంశీకృష్ణశర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం అధ్యక్షుడిగా కృష్ణారావు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం బీజేవైఎం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు కుంట రాంరెడ్డి తెలిపారు. బీజేవైఎం మండలాధ్యక్షుడిగా దొడ్లె కృష్ణారావు, ప్రధాన కార్యదర్శులుగా వడ్ల రామకృష్ణ, ఏనుగు సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులుగా పిల్లి నవీన్, ప్రణీత్‌రెడ్డి,సంతోష్,వడ్ల వంశీ, కార్యదర్శులుగా మనోహర్, మహేశ్, వడ్ల శ్రీరాం, ప్రణీత్, కార్యవర్గ సభ్యులుగా ప్రశాంత్ రావు, చౌకి రాకేశ్, కోశాధికారిగా నారెడ్డి నరేశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శులు మార రమేశ్‌రెడ్డి, భూంరావు, ఉపాధ్యక్షుడు చక్రధర్ గౌడ్ పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్ సామాజిక శాస్త్రం బీవోఎస్ చైర్మన్‌గా వీరభద్రం



భిక్కనూరు: తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్ సామాజిక శాస్త్రం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా(బీవోఎస్) డాక్టర్ వీరభద్రంను నియమించారు. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరభద్రం మాట్లాడుతూ.. సామాజిక శాస్త్ర విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ బుర్ర వెంకటేశం,రిజిస్ట్రార్ యాదగిరిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. బాలుర హాస్టల్ వార్డెన్ డాక్టర్ యాలాద్రి, అధ్యాపకుడు డాక్టర్ నారాయణ గుప్తా పాల్గొన్నారు.

బార్ అధ్యక్షుడి ఎన్నిక


అధ్యక్షుడు ప్రకాష్

బిచ్కుంద(జుక్కల్): మండల బార్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం జరిగాయి. అధ్యక్షుడిగా ఏ.ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా జి.మల్లేష్, జనరల్ సెక్రటరీగా శ్రీనివాస్, కోశాధికారిగా విఠల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అధ్యక్షుడు ప్రకాష్ తెలిపారు. సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ్, విఠల్, మహ్మద్, శివాజీ, పురుషోత్తం అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

లింగంపేట(ఎల్లారెడ్డి): భవానిపేట గ్రామానికి చెందిన పేద కుటుంబం చాకలి ఎల్లయ్య కూతురు వివాహానికి ప్రముఖ వైద్యుడు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్ బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా లింగంపేట మండల కేంద్రంలోని ఫంక్షన్ హాలులో జరిగిన పెళ్లికి తన అన్న కుమారులు శ్రీను, హాజీ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

బోరుమోటార్ బిగింపు



దోమకొండ: అంచనూరులో బుధవారం తాగునీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే నిధులతో బోరుమోటార్ బిగించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో తాగునీటి కొరత ఉందని తెలియగానే వెంటనే ఎమ్మెల్యే స్పందించి బోరుమోటార్ బిగించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పన్యాల రవీందర్ రెడ్డి, అనుపాటి నరేందర్‌రెడ్డి, తిప్పాపురం రవి, అంచనూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు రవి, నాయకులు సత్యనారాయణ, లక్ష్మణ్, నీలం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోచారంను విమర్శించే స్థాయి మీకు లేదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడకు వలస వచ్చిన కాంగ్రెస్ నాయకుడి వద్ద ఉన్న కొందరు కాంగ్రెస్ నాయకులు పోచారంపై విమర్శలు చేస్తున్నారని, విమర్శలు చేసిన వారంతా ఒక్కప్పుడు బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని, పదవులు, అనుభవించిన వారు నేడు పోచారంపై ఆరోపణలు చేయడం శోచనీయమని అన్నారు. పోచారం ప్రజలకు జవాబు చెబుతారే తప్ప కాంగ్రెస్ నేతలకు కాదని హితవు పలికారు. నాయకులు నార్ల ఉదయ్, గడుమల లింగం, కనుకుట్ల రాజు, బాబా, తదితరులున్నారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి


తిర్మలాపూర్‌లో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో


దోస్త్‌పల్లిలో హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీవో

బాన్సువాడ రూరల్: ఉపాధి హామీ అధికారులు సూచించిన కొలతల ప్రకారం పనులు చేపడితే కూలి గిట్టుబాటు అవుతుందని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ కూలీలకు సూచించారు. బుధవారం ఆయన కొత్తబాది, తిర్మలాపూర్ గ్రామ శివార్లలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఎండలు ముదరక ముందే పనులు పూర్తిచేసుకోవాలని సూచించారు. కూలీలకు సరిపడా మంచినీరు, షేడ్ నెట్స్ అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. అనంతరం హరిత హారం కోసం సిద్ధం చేస్తున్న నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు.

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా ఉపాధి పనులు చేస్తేనే కూలి గిట్టుబాటుగా లభిస్తుందని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం జుక్కల్ మండలం దోస్త్‌పల్లి గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు మస్టర్లను తనిఖీ చేశారు.

రైతుల సహకారంతోనే సంఘం అభివృద్ధి


మాట్లాడుతున్న చైర్మన్ భీంరెడ్డి

బిచ్కుంద(జుక్కల్): రైతుల సహకారంతో పుల్కల్ సొసైటీ దినదిన అభివృద్ధి సాధించిందని సంఘం చైర్మన్ భీంరెడ్డి అన్నారు. బుధవారం సంఘం మహాజన సభ నిర్వహించారు. కార్యదర్శి సాయి ప్రకాష్ నివేదిక చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎన్ని రుణాలైనా ఇవ్వడానికి సంఘం సిద్ధంగా ఉందన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తరుగు పేరుతో కోతలు విధించకుండా చూడాలి.. ఖరీఫ్‌లో సోయా విత్తనాలు సొసైటీలో అందుబాటులో ఉంచాలని రైతులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మాజీ సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఇంటర్నేషన్ వైశ్య ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న సరంపల్లి వద్ద గల గిరిజన బాలుర డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం 9 గంటల నుంచి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు, కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఎన్ఎస్ఎస్ అధికారి రామలక్ష్మి తెలిపారు. కామారెడ్డి ఏరియా ఆసుపత్రిలో రక్త నిల్వలు లేనందున రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల కోసం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఫిజియోథెరపి శిబిరం

బాన్సువాడ రూరల్: మండల కార్యాలయ ఆవరణలో ఉన్న భవితకేంద్రంలో గురువారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించనున్నట్లు కేంద్రం ఉపాధ్యాయులు పద్మ, వసంత్ తెలిపారు. దివ్యాంగ విద్యార్థులను తల్లిదండ్రులు కేంద్రానికి తీసుకుని రావాలన్నారు. ఫిజియోథెరపిస్టు గంగాధర్ అందుబాటులో ఉంటారనన్నారు.

గృహ ఉపయోగకర రసాయనాల తయారీపై వర్క్‌షాప్



కామారెడ్డి అర్బన్: ఇళ్లలో ఉపయోగపడే రసాయన పదార్థాలను చౌకగా, నాణ్యతతో తయారు చేసుకునే నైపుణ్యంపై అవగాహన కల్పించడానికి ఈనెల 28న గురువారం ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొని గృహ ఉపయోగకర రసాయన పదార్థాలను తయారు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, అకడమిక్ సమన్వయకర్త వి.శంకరయ్య, కెమిస్ట్రీ హెచ్‌వోడీ శారద, అధ్యాపకులు శ్రీలత, శ్రీనివాస్‌రావు, జువేరియా, సుచరణ్ పాల్గొన్నారు.

రెగ్యులర్ ఆఫీసర్‌ను నియమించండి



బాన్సువాడ : బాన్సువాడలో కార్మిక శాఖకు రెగ్యులర్ అధికారిని నియమించాలని బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ షేక్ దావుద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ.. బాన్సువాడలో పని చేసిన ఏఎల్‌వో బదిలీపై వెళ్లడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి బాన్సువాడలో ఏఎల్‌వోను నియమించాలని కోరారు. కార్మికులు శంకర్, కిష్టయ్య, లక్ష్మణ్, బాల్ రాజ్, పోచయ్య, విజయలక్ష్మి ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ : మహర్షి దయానంద సరస్వతి దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం బాన్సువాడ ఆర్య సమాజ్ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇందూరు సమాజ్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. ఈ నెల 31న ఇందూర్‌లో మహర్షి దయానంద సరస్వతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాలకు హిందూ బంధువులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఇందూరు సమాజ్ కార్యదర్శి నారాయణ, ఆర్య సమాజ్ ప్రతినిధులు కొత్తపల్లి శ్రీనివాస్, హరిదాస్, తదితరులున్నారు.

జీవ ఎరువులు వాడండి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు జీవ ఎరువులు వాడాలని రిటైర్డు ఏడీఏ నరసింహాచారి సూచించారు. ఎర్రాపహాడ్ రైతు వేదికలో బుధవారం గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఏడీఏ మాట్లాడుతూ .. వ్యవసాయ కళాశాల విద్యార్థులు వారు నేర్చుకున్న విషయాలను రైతులకు క్లుప్తంగా వివరించాలన్నారు. వ్యవసాయ సాగులో రైతులు పాటించవలసిన మెలకువలపై అవగాహన కల్పించారు. ట్రైనర్ రాజు, నారాయణ, ఏఈవో రాకేష్, విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



కామారెడ్డి అర్బన్: ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ విశ్వ విద్యాలయం సమన్వయకర్త ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం వన్ డే రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ కన్వెన్షన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని, జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులు ఎయిడ్స్ గురించి చర్చించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్, ఎయిడ్స్ కంట్రోల్ యూత్ సమన్వయకర్త రమేష్, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, సమన్వయకర్త వి.శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

భిక్కనూరు: అంతంపల్లి ఎర్రకుంటలో అక్రమంగా మొరం తవ్వకాలను నిర్వహిస్తున్నారని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడీ భూపాల్, వీడీసీ ఉపాధ్యక్షుడు నాగరాజుల ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు కామారెడ్డిలో ఆర్డీవో రంగనాథ్ రావుకు భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌లకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతి పత్రాలను అందజేశారు. కొన్ని రోజులుగా అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయని, తాము రెండు రోజుల క్రితం ఎర్రకుంటకు వెళ్లి తవ్వకాలను అడ్డుకోగా తమపై టిప్పర్, పొక్లెయినర్‌తో అంతమొందించాలని చూశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే మొరం తవ్వకాలను నిరోధించి తమకు రక్షణ కల్పించాలని వారు వినతి పత్రంలో కోరారు. చంపుతామంటూ ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

నిజాంసాగర్(జుక్కల్): వేసవిలో ఎండలు మండుతున్న దృష్ట్యా గిరిజన తండాలు, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం జుక్కల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోరు బావుల్లో భూగర్భ జలాలు తగ్గుతుండటంతో గ్రామాల్లో నీటి ఎద్దడి ఎదుర్కొనే ప్రాంతాలను గుర్తించాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూళ్లు చేయాలని సూచించారు. ఉపాధి పనుల్లో కూలీల హాజరు మరింత పెంచాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నయీం, ఈజీఎస్ ఈసీ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేయాలి

- రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్


బాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

బాన్సువాడ : జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం బాన్సువాడలోని తన నివాసంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500లకే సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ గృహ నిర్మాణం వంటి పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న సురేష్ షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. పొతంగల్, అంకోల్, వర్ని, రుద్రూర్, కోటగిరి మండలాల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

'నిరుద్యోగులను బీజేపీ మోసం చేస్తోంది'


దోమకొండలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు


లింగంపల్లి గ్రామ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు

దోమకొండ: ఉద్యోగాల కల్పన పేరుతో నిరుద్యోగులను బీజేపీ మోసం చేస్తోందని యూత్ కాంగ్రెస్ కామారెడ్డి అసెంబ్లీ అధ్యక్షుడు ఐరేని సందీప్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బూత్ స్థాయిలో పార్టీని యువత, ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి మోసం చేసిందన్నారు. వారి బూటకపు మాటలను యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రచారంలో ప్రజలకు వివరించాలని కోరారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి అన్నారు. బుధవారం లింగంపల్లి, భూంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. లింగంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షునిగా చిన్నబీర లింగారావు, ఉపాధ్యక్షుడిగా మధుసూదన్, ప్రధానకార్యదర్శిగా నందం, కార్యదర్శిగా పురుషోత్తం, కోశాధికారిగా చందర్‌రావు, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా నవీన్, బీసీ సెల్ అధ్యక్షుడిగా భాస్కర్ రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నర్సయ్యలను ఎన్నుకున్నారు.

భూంపల్లిలో...

భూంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సుంకరి నర్సింలు, ఉపాధ్యక్షుడిగా గొల్ల శంకర్, ప్రధాన కార్యదర్శిగా మొగ్గం బాల్‌రాజ్, కార్యదర్శిగా గంగయ్య, కోషాధికారిగా బాల్‌చంద్రంలను ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా గొల్ల భాస్కర్, ప్రధానకార్యదర్శిగా సంజీవ్ రావు, కార్యదర్శిగా శివాజీలను ఎన్నుకున్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. బ్యాంక్ రుణాలు అన్ని సంఘాలకు చేరే విధంగా చూడాలన్నారు. అలాగే స్త్రీనిధి రుణాలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. సమాఖ్య అధ్యక్షురాలు శోభ, సీసీలు అబ్బులింగం, అంజయ్య, రాములు, నరేందర్ రెడ్డి, సౌజన్య, కృష్ణాంజలి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రామారెడ్డి వెనకంజ



రామారెడ్డి: అభివృద్ధిలో రామారెడ్డి వెనుకబడిందని రామారెడ్డి జెడ్పీటీసీ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొన్ని గ్రామాలు కామారెడ్డి నియోజకవర్గంలో, మరికొన్ని గ్రామాలు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కలిసి ఉండడంతో అభివృద్ధి జరగడం లేదన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య రామారెడ్డి మండలం వెనకబాటుకు గురవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో రామారెడ్డి మండలాన్ని కామారెడ్డి నియోజకవర్గంలో చేర్చాలని, ఈ దిశగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.